

'గిరి' గూడేల్లో పండుగల సీజన్

మారుతున్న ఆధునిక కాలంలోనూ ఆదివాసీలు తమ ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఆషాఢంలో అకాడితో పండుగలు ప్రారంభమవుతాయి. 8లో▸



బీజేపీని గద్దె దించడానికి త్రిముఖ వ్యూహం

బీజేపీని గద్దె దించడానికి త్రిముఖ వ్యూహాలతో పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. మంచిర్యాలలో సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతాయి.

న్యూస్‌రీల్

బడి పనులు పూర్తి చేయాలి



పనులపై తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ

భీమిని: మన ఊరు–మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ కాకిరాల నరేందర్ సూచించారు. బుధవారం కన్నెపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నెపల్లి మండలంలో 11 పాఠశాలలు మన ఊరు–మన బడికి ఎంపికయ్యాయని, పనులు ఎక్కడికి వరకు వచ్చాయని ఆరా తీశారు. అనంతరం టేకులపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో పనులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాధాకిషన్, ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎన్‌ఐటీలో సీట్లు సాధించారు. కళాశాలలో విద్యనభ్యసించిన పొట్టల విష్ణు జేఈఈ మెయిన్స్‌లో 97.82 పర్సంటైల్ సాధించగా కేరళ రాష్ట్రంలోని తిరుచ్చి ఎన్‌ఐటీలో సీటు లభించింది. అల్లూరి శివకుమార్ 96.28 పర్సంటైల్ సాధించగా విజయవాడ కళాశాలలో బ్యాచిలర్ ఆర్కిటెక్ట్ కోర్సులు సీటు దక్కింది. విద్యార్థులను బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ నాగిని శ్రీరామవర్మ, అధ్యాపకులు మిట్టా రమేష్, చందా లక్ష్మీనారాయణ, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్

బెల్లంపల్లిరూరల్: గ్రామీణ ప్రాంత యువత ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, టీపీసీసీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్ కాంపెల్లి ఉదయ్‌కాంత్ అన్నారు. బుధవారం మండలంలోని లంబాడి తండా గ్రామంలో మేము సైతం ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం, గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేము సైతం ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపకుడు రంగ ప్రశాంత్, అధ్యక్షుడు బోగె సత్యం, బెల్లంపల్లి అభివృద్ధి సంస్థ కార్యదర్శి ఆదర్శ్‌వర్ధన్ రాజు, భవిత కళాశాల అధినేత హీరాలాల్‌ఉపాధ్యాయ, సర్పంచ్ రాయమల్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిధులు మంజూరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనం నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. 1నుంచి 8వ తరగతి వరకు కుకింగ్ కాస్ట్ చెల్లింపునకు బడ్జెట్ మంజూరు చేశారు. ఈ ఏడాది మార్చి నెలకు సంబంధించిన రూ.35,70,000 మంజూరయ్యాయని డీఈవో యాదయ్య తెలిపారు.

ప్రతీ పాఠశాల నుంచి నామినేషన్లు పంపించాలి

మంచిర్యాలఅర్బన్: ఇన్‌స్పైర్ మనక్‌కు ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రాథమికోన్నత, హైస్కూల్ హెచ్‌ఎంలు, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో ఇన్‌స్పైర్ మనక్ యాప్ ద్వారా ఈఎంఐఏఎస్ ఆన్‌లైన్ నామినేషన్ పంపే విధానంపై జూమ్ ద్వారా అవగాహన కల్పించారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని పాఠశాలలు ఈఎంఐఏఎస్ వెబ్‌పోర్టల్, యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 31లోపు జిల్లాలోని అన్ని పాఠశాలల నామినేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లు క్లోజ్





చెన్నూర్ కేజీబీవీ ఎదుట అడ్మిషన్ క్లోజ్ బోర్డు

- సీట్లు లేవంటూ బోర్డులు
- అధిక సంఖ్యలో దరఖాస్తులే కారణం

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)పై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. ఫలితంగా చేరికలకు సీట్లు లేవంటూ గేటు ఎదుట బోర్డులు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల ప్రవేశాలకు జూన్ 3 నుంచి 9వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేశారు. మీ పిల్లలకు మేం భరోసా ఇస్తామంటూ కరపత్రాలు, బ్యానర్లతో విస్తృత ప్రచారం చేశారు. 6వ తరగతిలో సీట్ల కంటే ఎక్కువగా దరఖాస్తులు రావడంతో ప్రత్యేక అధికారులు తల పట్టుకుంటున్నారు. అడ్మిషన్లు లేవంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా మేడం ఒక్క సీటు(అడ్మిషన్) అంటూ విద్యార్థులు, కుటుంబ సభ్యులు కేజీబీవీలకు వస్తుండడంతో సమాధానం చెప్పలేక తంటాలు పడుతున్నారు.

ఎందుకిలా..

గ్రామీణ ప్రాంతాల నిరుపేద, అనాథ బాలికల కోసం కేజీబీవీలు ఏర్పాటు చేశారు. ఉచిత వసతితోపాటు విద్య అందిస్తుండడంతో ప్రవేశాలకు డిమాండ్ పెరిగింది. ఈ యేడాది పాఠశాల ప్రారంభానికి ముందే అడ్మిషన్లు ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఏ రోజుకారోజు గ్రామాల్లో తిరిగి ప్రవేశాలు పొందిన వివరాలు అందజేయాలని సూచించడంతో ప్రత్యేక అధికారులు అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. బడిబాట కార్యక్రమం చేపట్టడంతో కేజీబీవీలో కేటాయించిన సీట్లకు సరిపడా ప్రవేశాలు పూర్తి చేశారు. ఇంకోవైపు గురుకులాలు, మోడల్‌స్కూల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుల నుంచి పరీక్షల నిర్వహణ, మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు పూర్తి కావడంతో అక్కడ సీటు దొరకని బాలికలు కేజీబీవీల వైపు మొగ్గు చూపుతుండడంతో పోటీ పెరిగింది. ఆయా కేజీబీవీల్లో సీట్ల కేటాయింపు కంటే అధికంగా ప్రవేశాలకు వస్తుండడంతో ఏం చేయాలో ఎస్‌వోలకు తెలియకుండా పోయింది.

పారదర్శకంగా ప్రవేశాలు

కేజీబీవీల్లో కల్పిస్తున్న వసతులు.. నాణ్యమైన విద్యాబోధనతో డిమాండ్ అధికంగా ఉంది. కొన్ని కేజీబీవీల్లో కేటాయించిన సీట్ల కంటే దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. పోటీ తీవ్రంగా ఉన్నా ఎంపికలో డీఈవో యాదయ్య ఆదేశానుసారం పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

– పద్మజా, సెక్టోరల్ అధికారి, మంచిర్యాల

లక్ష్యానికి మించి...

ప్రతియేటా కేజీబీవీల్లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దీంతోపాటు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీల సీట్లు భర్తీ ఉంటుంది. జిల్లాలో 18 కేజీబీవీల్లో ఉండగా అందులో ఒక్కో తరగతిలో 40 మంది చొప్పున సీట్ల కేటాయింపు ఉంటుంది. కళాశాలలో మాత్రం ప్రథమ, ద్వితీయ సంవత్సరా నికి రెండేసి గ్రూపుల్లో 80 చొప్పున 160 సీట్లు భర్తీ చే యాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 4,978 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో కేజీబీవీలో లక్ష్యానికి మించి 20 వరకు అదనంగా దరఖాస్తులు రా వడంతో అడ్మిషన్లు క్లోజ్ అని బోర్డులు పెడుతున్నారు. గురుకులాలు, ఆ దర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలకు అర్హ త పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటిన వారినే ఎంపిక చేస్తారు. దీంతో పరీక్షల్లేని, వసతులు ఉన్న కేజీబీవీల్లోనే పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్ట పడుతున్నారు. భోజన, వసతితో సౌకర్యాలు బాగుంటుండడంతో కేజీబీవీల వైపు ఆసక్తి చూపుతున్నారు. అనాథలు, తల్లిదండ్రులు లేని వారు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల పిల్లలకు ప్రాధాన్యత క్రమంలో సీట్లు ఇస్తారు.

ఏదీ.. 'చెత్త' శుద్ధి?



ఐటీడీఏ ఉద్యాన నర్సరీ ఎదుట శ్మశాన వాటికలో పోసిన చెత్తకుప్పలు

- బెల్లంపల్లిలో డంప్‌యార్డు సమస్య
- ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లోకి పాత స్థలం
- ప్రత్యామ్నాయం చూపని పాలకవర్గం
- ఎక్కడ పడితే అక్కడే చెత్త పారబోత
- అధికారుల నిర్లక్ష్యంతో జనం ఇక్కట్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీని డంప్‌యార్డు సమస్య వెంటాడుతోంది. గతంలో ఏర్పాటు చేసిన డంప్‌యార్డు స్థలం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లోకి వెళ్లగా అధికారులు ప్రత్యామ్నాయం చూపలేదు. పట్టణంలో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను ఎక్కడ డంప్ చేయాలో మున్సిపల్ సిబ్బందికి సవాల్‌గా మారింది. మరో మార్గం లేక ఖాళీ ప్రదేశాలు, శ్మశనవాటికలు, జనావాసాల్లో డంప్ చేస్తున్నారు. తద్వారా సమీప నివాసాల ప్రజలు అనారోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లోకి వెళ్లడంతో..

మున్సిపాలిటీలోని కన్నాల బస్తీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో 15 ఏళ్ల క్రితం 10 ఎకరాల విస్తీర్ణంలో డంప్‌యార్డు ఏర్పాటు చేశారు. రూ.లక్షలు వెచ్చించి అన్ని సౌకర్యాలు కల్పించారు. డంప్‌యార్డు వరకు ప్రత్యేకంగా రోడ్డు నిర్మించారు. అనంతరం ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. స్థల సేకరణ కూడా పూర్తి చేసింది. కన్నాల, బుధాకలాన్ శివారులోని వివిధ సర్వే నంబర్లలో గల 355 ఎకరాల ప్రభుత్వ భూములను ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం గుర్తించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న డంప్‌యార్డు భూభాగం కూడా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కొత్తగా డంప్‌యార్డు ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయించక పోవడంతో చెత్తను డంప్ చేయడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఏళ్లు గడుస్తున్నా డంప్‌యార్డు స్థల సమస్య కొలిక్కి రాక పోవడం మున్సిపల్ అధికారులు, పాలకవర్గం అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పాలకవర్గ సభ్యుల పని తీరుపై పుర ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

శాంతిఖని శివారులో..

కొత్తగా డంప్‌యార్డు కోసం శాంతిఖని బస్తీకి చేరువలోగల ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 22లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రతిపాదించారు. భూమి సర్వే చేసి ఏడాదవుతోంది. కాగా, జనావాసాలకు దగ్గర డంప్‌యార్డు వద్దని శాంతిఖని, 65డీప్ బస్తీల ప్రజలు వ్యతిరేకించి ఆందోళన నిర్వహించారు. చెత్త తీసుకు వచ్చే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలను అడ్డగించి ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. దీంతో డంప్‌యార్డు ఏర్పాటు అంశం మరుగున పడింది. ఈక్రమంలో ప్రజలకు అభ్యంతరం లేని ప్రాంతాన్నీ గుర్తించి డంప్‌యార్డు ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేయాల్సి ఉండగా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా డంప్‌యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్థలం కోసం అన్వేషిస్తున్నాం



మున్సిపాలిటీ పరిధిలో డంప్‌యార్డు ఏర్పాటుకు అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నాం. ఇప్పటివరకు సరైన స్థలం లభించలేదు. రెవెన్యూ అధికారులకు స్థలం కోసం లేఖలు కూడా రాశాం. కానీ.. ఇంతవరకు ప్రభుత్వ స్థలాన్నీ గుర్తించి మున్సిపాలిటీకి స్వాధీనం చేయలేదు. సత్వరమే స్థలాన్ని గుర్తించి డంప్‌యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– కె.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

డంప్‌యార్డు లేక..

మున్సిపాలిటీలో ప్రస్తుతం డంప్‌యార్డు లేని దుస్థితి ఉంది. షాపులు, నివాస గృహాల నుంచి రోజువారీగా చెత్తను సరిగా సేకరించలేకపోతున్నారు. రెండు, మూడ్రోజులకోసారి చెత్త బండి వచ్చి చెత్తను తీసుకు వెళ్తున్నట్లు పురప్రజలు వాపోతున్నారు. ఇలా సేకరించిన చెత్తను ఏ ప్రాంతంలో డంప్ చేయాలో తెలియక సతమతమవుతున్నారు. చెత్త ట్రాక్టర్లు, ట్రాలీల డ్రైవర్లు దిక్కు తోచని పరిస్థితిని చవి చూస్తున్నారు. మున్సిపల్ రికార్డుల ప్రకారం బెల్లంపల్లి మున్సిపాలిటీలో రోజుకు 23 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఇంత భారీ స్థాయిలో చెత్త జమ అవుతుండగా డంప్‌యార్డు సమస్యతో 15 రోజులుగా పోచమ్మ గడ్డ శ్మశానవాటిక, ఐటీడీఏ హార్టికల్చర్ ఫాం ఎదుట, నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీకి చేరువలో, రోడ్ల పక్కన గుట్టుగా డంప్ చేసి వెళ్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో చెత్త నుంచి తీవ్రమైన దుర్గంధం వ్యాపించి ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పోడు పట్టాలతో గిరిజనులకు భరోసా

- ఎమ్మెల్యే రేఖానాయక్



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: ప్రభుత్వం గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి భరోసా కల్పించిందని, ఆ భూమికి రైతుబంధు కూడా ఇస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని పైడిపెల్లి గార్డెన్‌లో బుధవారం పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. మండలంలోని ఏడు గ్రామాలకు చెందిన 299 మంది గిరిజనులకు 486.31 ఎకరాల భూమి పోడు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు భూములకు సీఎం కేసీఆర్ పట్టాలిచ్చి ఆపద్బాంధవుడిగా నిలిచారని అన్నారు. 50 మందికి కల్యాణలక్ష్మి, రూ.10 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, తహసీల్దార్ కిషన్, ఎంపీవో రమేష్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రాజరాం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, పీఏసీఎస్ చైర్మన్‌లు రమేష్, రాజన్న, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేష్, ఎంపీటీసీ రియాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్ నిర్మాణానికి స్థలాలను బుధవారం సింగరేణి అధికారులు పరిశీలించారు. సీఎస్‌ఆర్ నిధులు రూ.2 కోట్లు మంజూరు కావడంతో పనులకు సంబంధించిన స్థలాలు గుర్తించారు. సింగరేణి బెల్లంపల్లి ఏరియా అధికారులు ఏఆర్ పోలీసు హెడ్ క్వార్టర్స్, ఐటీడీఏ ట్రైనింగ్ సెంటర్, బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్, కాసిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఆరు కమ్యూనిటీ హాళ్లు, 10 ఓపెన్ జిమ్‌ల కోసం స్థలాలను సింగరేణి అధికారుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎస్‌ఆర్ కమిటీ సభ్యులు ఎం.నరేందర్‌రావు, ఆర్.సతీష్‌బాబు, రామారావు, లక్ష్మారావు, రాజేంద్రప్రసాద్, పసుల మహేష్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ పరంజ్యోతి, భీమాగౌడ్ పాల్గొన్నారు.

సాగుపై ఆందోళన వద్దు

- విత్తుకునేందుకు సమయం ఉంది
- అధిక ధరలు మా దృష్టికి తీసుకరావాలి
- జిల్లా సహాయ వ్యవసాయ అధికారి అనిత
- సాక్షి ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న జిల్లా సహాయ వ్యవసాయ అధికారి అనిత, ఏవో క్రిష్ణ

మంచిర్యాలఅగ్రికల్చర్: 'వర్షాలు ఆలస్యమైనా అనుకూలంగా కురుస్తాయి. రైతులు ఆందోళన చెందవద్దు. పంటలు విత్తుకునేందుకు ఇంకా సమ యం ఉంది. జిల్లాలో అధికంగా సాగు అవుతున్న పత్తి విత్తనాలు వేసుకునేందుకు ఈ నెల 20వరకు అనుకూలం. ఆశించిన వర్షాలు లేక ఇంకా చెరువులు, కుంటలు, జలాశయాల్లోకి నీరు రానందున మధ్యకాలిక, స్వల్ప కాలిక వరి రకాలు నారు పోసుకుంటే మేలు..' అని జిల్లా సహాయ వ్యవసాయ అధికారి బి.అనిత రైతులకు సూచించారు. జిల్లా సహాయ వ్యవసాయ అధికారి కార్యాలయంలో 'సాక్షి' బుధవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని రైతులు పంటల సాగులో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై ఏడీఏ అనిత, ఏవో క్రిష్ణ సమాధానం ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో విత్తనాల ఎంపిక, ఎరువులు, మందుల వినియోగం, గతంలో తెగుళ్లతో నష్టం, ఏ భూ ముల్లో ఏయే పంటలు వేయాలి, సాగు పనులు తదితర అంశాలపై సూచనలు చేశారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రైతువేదికల్లో నిర్వహించే రైతు శిక్షణ తరగతులకు హాజరై ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, విత్తనాలు వేసుకోవడం, వర్షాలకు అ నుగుణంగా పంటల సాగు, ఎరువులు, ఇతరత్రా పంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు పొందాలని సూచించారు.

నాది నల్లరేగడి భూమి. పత్తి సాగు చేస్తున్న గత రెండేళ్లుగా పత్తి పంటలో పూత, కాత దశలో రాలిపోతుంది. ఈ ఏడాది కూడా అలాగే ఉంటే ఏమి చేయాలి.

– మల్లేష్, గ్రామం: కవ్వాల్, మం: జన్నారం

ఏడీఏ: సూక్ష్మధాతులోపం వల్ల పూత, కాత రాలి పోతుంది. 20 జింక్ సల్ఫేట్ చివరి దుక్కిలో మా త్రమే వేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే విత్తనం నాటి ఉంటే స్వర్ణపాల్ కాలిని, ఫర్మూల 4, ఫ ర్మూల ఫోర్ 7ను 10 గ్రాములు 1 లీటర్ నీటిలో, లేదా మెగ్నీషియం 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. పూత కాత కు వచ్చిన సమయంలో మీ మండల ఏఈవో, లేదా ఏవో దృష్టికి తీసుకెళ్తే సూచనలు చేస్తారు.

ఐదెకరాల్లో పామాయిల్ మొక్కలు నాటుకున్నాం. అంతర పంటగా పత్తి సాగు చేస్తే పామాయిల్ చెట్లకు ఇబ్బంది ఏమైనా ఉంటుందా..?

– రైతు బానోత్ శివాలాల్, గ్రామం: కన్నెపెల్లి, మం: దండేపల్లి

ఏడీఏ: పామాయిల్ తోటల్లో మూడేళ్ల వరకు అంతర పంటగా పత్తితోపాటు కంది, పెసర, మొక్కజొన్న తదితర పంటలు వేసుకోవచ్చు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. మూడేళ్ల వరకు అంతర పంటలతో అదనపు ఆదాయం పొందవచ్చు.

పత్తిలో కలుపు నివారణకు ఏ మందు వాడాలి.

– రైతు మల్లేష్, తాండూర్

ఏడీఏ: పత్తి విత్తిన 48 గంటల్లోపు పెండిమెథలిన్ కలుపు మందు ఒక లీటర్ ఎకరానికి ఇసుకలో కలుపుకొని పిచికారీ చేయాలి. మూడు రోజుల తర్వాత కలుపు మందు వేయవద్దు.

వర్షాలు లేక పోలం బీడుగా ఉంది. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో ఎలాంటి వరి విత్తన సాగు చేసుకోవచ్చు. – రైతులు తిరుపతి, భీమారం, దుర్గప్రసాద్, గ్రామం: తాళ్లపేట, మం: దండేపల్లి, కొలిపాక శ్రీనివాస్, బెల్లంపల్లి

ఏడీఏ: ఇంకా నారు పోసుకోని రైతులు మధ్యకాలిక రకాలు 120 నుంచి 130 రోజుల్లో దిగుబడి వచ్చే వరి రకాలు వేసుకోవాలి. కొన్ని మధ్యకాలిక జైశ్రీరాం, సాయిరాం, అంకూర్ 101, తదితర రకాలు నీటి సౌకర్యం ఉన్న రైతులు ఈ నెలాఖరులోపు నాట్లు వేసుకోవాలి. లేదా పప్పుదినుసులు, మొక్కజొన్న పంట విత్తుకోవచ్చు.

ఈ ఏడాది మిర్చి సాగు చేసుకోవచ్చా. గతేడాది మిర్చి సాగు చేసిన. నల్లి తెగులు ఆశించింది.

– రైతు సత్యనారాయణ, గ్రామం: వేలాల, మం: జైపూర్

ఏడీఏ: సాగు చేసుకోవచ్చు. ముందుగా నారు నాణ్యమైన రకం ఎంచుకోవాలి. 15 నుంచి 20 రోజుల నారు నాటాలి, నల్లితెగులు ఆశించిన సమయంలో ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలి.

పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్ముతున్నారు. చర్యలు తీసుకోవాలి.

– రైతు శ్రీనివాస్, గ్రామం: శివ్వారం, మం: జైపూర్

ఏడీఏ: అధిక ధరలు అమ్ముతున్న డీలర్లపై ప్రత్యేక నిఘా ఉంది. టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అధిక ధరలకు విత్తనాలు ఎక్కడ అమ్ముతున్నా డీలర్ పేరు, దుకాణం వివరాలు చెబితే వారిపై తప్ప కుండా చర్యలు తీసుకుంటాం. రైతులు ఎక్కు వ ధరలు చెల్లించి కొనుగోలు చేయకూడదు. ఎంఆర్పీకి మాత్రమే కొనుగోలు చేసి రశీదు దగ్గర పెట్టుకోవాలి.

పత్తి, మిర్చి పంటలో గతేడాది రసం పీల్చే పురుగు ఆశించి నష్టపరిచింది. ముందస్తుగా పురుగు ఆశించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

– రైతు రమేష్, జైపూర్

ఏడీఏ: ఈ ఏడాది కూడా పురుగు ఆశించినట్లయి తే పిప్రోనిల్ 500 ఎంల్ ఎకరానికి స్ప్రే చేయాలి. పత్తి, మిర్చి పంటలో గెట్లపై బంతిపూల చెట్లు నాటుకోవడం మూలంగా పురుగు ఆశించే అవకాశం ఉండదు.

వరి వెదజల్లె పద్ధతిలో సాగు చేసుకున్న. రెండు రోజులు అవుతుంది. కలుపు నివారణకు ఏ మందు వేసుకోవాలి. – రైతు వెంకటేశ్వరావు, దండేపల్లి

ఏడీఏ: ప్రస్తుతం ఏ మందులు వేసుకోవద్దు. కలుపు నివారణకు 15 రోజుల తర్వాతనే బిస్ పైరిబక్ సోడియం 100 గ్రాములు ఎకరాకు, లేదా పెట్రోల్లకోర్ 100 ఎకరానికి పిచికారీ చేసుకోవాలి.

ఎరువులు అందుబాటులో ఉన్నాయా. మా మండలంలో అధిక ఎరువులు ధరలకు అమ్ముతున్నారు. – రైతు బంటు శ్రీనివాస్, కన్నెపల్లి

ఏడీఏ: ఎరువుల బస్తాలు అందుబాటులో ఉన్నా యి. ఎలాంటి ఇబ్బంది లేదు. అధిక ధరలు అ మ్ముతున్న డీలర్, లేదా సొసైటీ పేరు వివరాలు ఏఈవో, లేదా ఏవోకు ఫిర్యాదు చేయాలి. సొసైటీలో యూరియా బస్తా రూ.266, డీఏపీ రూ.1260 మాత్రమే చెల్లించి కొనగోలు చేయాలి. డీఏపీ 2020 కొన్ని కంపెనీలను బట్టి ధరలు హెచ్చుతగ్గలు ఉంటాయి. విత్తనాలు కాని ఎరువులు అధిక ధర చెల్లించి ఎవరూ కొనుగోలు చేయవద్దు. కొనుగోలు చేసిన రశీదు దగ్గర పెట్టుకోవాలి.

ఈ ఏడాది సాగుకు అనుకులంగా వర్షాలు ఉంటాయా. పత్తి సాగు ఎప్పటివరకు చేసుకోవచ్చు. గతేడాది రసం పీల్చే పురుగు ఆశించి నష్టపరిచింది.

– రైతు గంగయ్య, గ్రామం: వేలాల, మం: జైపూర్

ఏడీఏ: ఆలస్యమైనా మంచి వర్షాలే ఉంటాయి. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. పత్తి సాగు ఈ నెల 15 వరకు విత్తుకోవచ్చు. ఈ ఏడాది కూడా రసం పీల్చే పురుగు ఆశిస్తే సూక్ష్మపోషకాల కోసం 10 గ్రాములు 19.19.19 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

డీలర్లు కొంతమంది లైసెన్స్ ఒకరిది, దుకాణం మరొకరు నడిపిస్తున్నారు. కంపెనీ ఆఫర్ల కోసం నాణ్యతలేని, నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్ముతున్నారు. వాళ్లు ఇచ్చిందే మందు అన్నట్లుగా రైతులకు అంటగడుతున్నారు. అవి పనిచేయక నష్టపోవాల్సి వస్తుంది. – రైతు స్వామిగౌడ్, నెన్నెల

ఏడీఏ: విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల దుకాణాల డీలర్లకు ప్రతీ సంవత్సరం శిక్షణ తరగతులు, పరీక్ష నిర్వహణ, సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుంది. అర్హత పొందిన డీలర్లకు లైసెన్స్‌లు, దుకాణ నిర్వహణ ఉంటుంది. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్ముతున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. తెగుళ్లు, చీడపీడలు ఆ శించిన ఇతర వివరాల కోసం మండల ఏవో, లేదా ఏఈవోను సంప్రదించాలి. వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా ఎరువుల వి నియోగం, రసాయన మందులు స్ప్రే చేయాలి. డీలర్లు సూచించిన విధంగా కాదు.

రాయితీపై ఏ పంట విత్తనాలు ఇస్తున్నారు. అందుబాటులో ఉన్నాయా.

– రైతు కే.హరిబాబు, భీమారం

ఏడీఏ: ప్రస్తుతం ప్రభుత్వం ఏ పంట విత్తనాలూ ఇవ్వడం లేదు. సేంద్రియ ఎరువుగా వినియోగించే పచ్చిరొట్టె జీలుగ, జనుము విత్తనాలు మాత్రమే ఇస్తున్నారు. ఈ విత్తనాలు ఇప్పటికే సరఫరా చేయడం జరిగింది. కొన్ని చోట్ల ఇంకా అందుబాటులో ఉన్నాయి. పచ్చిరొట్టె విత్తనాలు అవసరం అనుకుంటే మీ వద్ద ఉన్న ఏఈవోను జీలుగ, జనుము కోసం సంప్రదించండి.

‘గిరి’ గూడేల్లో పండుగల సీజన్

- అకాడితో ప్రారంభమై దీపావళితో ముగింపు
- నాలుగు మాసాలు వివిధ రకాల పండుగలు
- కుల దేవతలకు ప్రత్యేక పూజలు
- ఆదివాసీ పల్లెల్లో కోలాహలం


మేకతో జాతకం చెప్పించుకుంటున్న ఆదివాసీలు


ఆకిపేన్ వద్ద పూజలు

కెరమెరి(ఆసిఫాబాద్): మారుతున్న ఆధునిక కాలంలోనూ ఆదివాసీలు తమ ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఏటా ఆషాఢమాసంలో వచ్చే అకాడి పండుగతో ప్రారంభమైన ఆదివాసీ పండుగలు, ఉత్సవాలు దీపావళి పర్వదినంతో ముగుస్తాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయా గ్రామాల్లో ఆదివాసీలు అకాడి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అకాడి తర్వాత జాంబురావుస్, శివబోడి, నాగపంచమి, రక్షాబంధన్, పొలాల అమావాస్య, బడిగా, దసరా, దీపావళి పండుగలు జరుపుకుంటారు.

అకాడి పండుగ..

ఆషాఢమాసం ప్రారంభంలో వచ్చే పండుగ అకాడి. అడవిని దేవతగా కొలిచే ఆదివాసీలు పాడిపశువులకు రక్షణ కల్పించే దేవతగా రాజుల్ పేన్‌ను పూజిస్తారు. నెలవంక కనిపించగానే ప్రారంభమయ్యే ఈ పండుగను జిల్లాలోని అన్ని గ్రామాల్లో జరుపుకుంటారు. అకాడి పండగను కొందరు పౌర్ణమి వరకు నిర్వహిస్తే మరికొందరు అమావాస్య వరకు జరుపుకుంటారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారమని ఆదివాసీ పెద్దలు, కటోడాలు చెబుతున్నారు. అకాడిలో భాగంగా ఆకిపేన్‌కు పూజలు చేస్తారు. ఈ కాలంలో మేతకోసం అడవిలోకి వెళ్లే మూగజీవాలకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, సాగు చేసిన పంటలు అధిక దిగుబడులు సాధించాలని ఆకిపేన్‌కు పూజలు చేస్తారు. ఇందులో భాగంగా ఒక గీత గీసి ఆ గీతపై నుంచి పశువులను అడవిలోకి తోలుకెళ్తారు. ప్రత్యేకంగా తయారుచేసిన తుర్రను ఊదడంతో పశువులు అడవిలోకి పరుగెత్తుతాయి. అంతేకాకుండా కోడి, మేకలతో జాతకం చెప్పించుకుంటారు.

విజ్జపేన్..!

ఈ క్రమంలోనే విజ్జపేన్ (విత్తన పూజలు) చేస్తారు. కొనుగోలు చేసిన విత్తనాలను పెర్సాపేన్, రాజుల్ దేవతలకు చూపించి పూజలు చేస్తారు. పంటలకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని పెర్సాపేన్‌కు మొక్కుతారు. అనంతరం ఎవరికి వారు తమ ఇష్టదైవమైన కులదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆతర్వాతే పొలం పనులు ప్రారంభిస్తారు.


బియ్యపు ముద్ద ఉండలతో దేవారి పూజలు

‘సీత్ల’ పండుగ

లంబాడీల దేవత సీత్ల అమ్మవారు. కలరా వంటి వ్యాధుల బారినుంచి కాపాడుతుందని వారి నమ్మకం. గ్రామ సరిహద్దు పొలిమేరల్లోని కూడలి వద్ద సీత్ల భవానిని ప్రతిష్ఠిస్తారు. ఆషాఢమాసంలోని ఒక మంగళవారం మహిళలు, యువతులు బోనమెత్తుకుని అమ్మవారి వద్దకు వెళ్లి పాటలు పాడుతారు, నృత్యం చేస్తారు. అమ్మవారికి పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు. కోళ్లు, మేకలు బలిచ్చి వాటిపై నుంచి పశువులను దాటిస్తారు. పశుసంపద వృద్ధి చెందాలని, పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని మొక్కుకుంటారు.

పండుగలకు ప్రత్యేకత



ఆదివాసీలు జరుపుకునే పండుగలకు ప్రత్యేకత ఉంది. అకాడి నుంచి ప్రారంభమైన పండుగలు నాలుగు మాసాలపాటు కొనసాగుతాయి. దీపావళికి గుస్సాడీ దీక్ష స్వీకరించే భక్తులు ఇప్పుడే కుల దేవతలకు మొక్కుకుంటారు. కార్యం నెరవేరాక దీక్ష చేపడతారు.

– కుర్సెంగ దుందేరావు, ఆదివాసీ నాయకుడు, చౌపన్‌గూడ

వన భోజనాలు..

వనాలతో సన్నిహితంగా ఉన్న ఆదివాసీలు అకాడిలో వనదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామ పొలిమేరలో ఉండే బాబ్రిచెట్టు వద్దకు వెళ్తారు. చెట్టుకింద ఉన్న దేవత ప్రతిమలను శుద్ధి చేస్తారు. అనంతరం పసుపుతో గీతలు గీస్తారు. వాటి ఎదుటే బియ్యం పోసి రాజుల్ పేన్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడే వండిన వంటలతో అడవి దేవతలకు నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తారు. అడవిలోని చెట్ల ఆకులను ఇంటికి తీసుకెళ్తారు.

క్లుప్తంగా

విధులు బహిష్కరించిన కాంట్రాక్టు కార్మికులు


కార్మికులతో మాట్లాడుతున్న ఎస్సై గంగారాం

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ కాంట్రాక్టర్ తీరును నిరసిస్తూ బుధవారం కాంట్రాక్టు కార్మికులు, డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. గతనెల చేసిన సమ్మెకు సంబంధించి మూడు మస్టర్లు ఇస్తామని చెప్పిన అధికారులు అవి కలపకుండ మస్టర్లు ప్రకటించడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఎస్సై గంగారాం సంఘటన స్థలానికి చేరుకుని కార్మికులతో మాట్లాడినప్పటికీ ఆందోళన విరమించలేదు. దీంతో శాంతియుతంగా నిరసన తెలుపుకోవాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి షిఫ్టు నుంచి సమ్మె కొనసాగుతోంది.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

చెన్నూర్: పట్టణంలోని పంచముఖ హనుమాన్ టెంపుల్ సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న నిమ్మల మధు, శిరీష దంపతులు బుధవారం మడేళేశ్వరాదేవి బోనాల జాతర సందర్భంగా రజకవాడలో సొంతింటికి ఆటోలో వెళ్లారు. నగలు, నగదు ఉంచిన బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయి ఇంట్లోకి వెళ్లారు. బ్యాగ్ కనిపించకపోవడంతో సీఐ వాసుదేవరావుకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఆటోను గుర్తించారు. బ్లూకోల్ట్ సిబ్బంది ఖదీర్ ఆటోను తనిఖీ చేయగా బ్యాగ్ లభించింది. అందులో 8 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.8 వేల నగదు ఉన్నాయి. బ్యాగ్‌ను బాధిత దంపతులకు సీఐ చేతుల మీదుగా అప్పగించారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు

మందమర్రిరూరల్: సారంగపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సండ్రోన్‌పల్లి సమీపంలో మూలమలుపు వద్ద బుధవారం ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందికి వెళ్లింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను తీసుకువచ్చేందుకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు దిగి కిందికి వెళ్లింది. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాసేపటికి జేసీబీతో స్కూల్ బస్సును రోడ్డెక్కించారు. ఈ సందర్భంగా విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులు నడవడం లేదని, సంబంధిత అధికారులు మామూళ్లకు అలవాటు పడి తనిఖీ చేయడం లేదని ఆరోపించారు. నిబంధనల ప్రకారం నడవని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిర్దిష్ట సమయంలో టీకాలు ఇప్పించాలి


టీకాల ప్రక్రియ పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: చిన్నారులకు క్రమం తప్పకుండా సమయానికి టీకాలు ఇప్పించాలని, క్రమం తప్పిన టీకా మోతాదులు ఇచ్చేందుకు ఇంద్రధనుష్ కార్యక్రమం చేపడుతున్నట్లు సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మేదరివాడ, ఏసీసీ, తదితర ప్రాంతాల్లో టీకాల సరళిని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలో టీకా ఇప్పించని వారి కోసం మిషన్ ఇంద్రధనుష్ మొదటి విడత ఆగస్టు 1 నుంచి 12, రెండో విడత సెప్టెంబర్ 11 నుంచి 16, మూడో విడత అక్టోబర్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే 7 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, 250 గజాల స్థలం, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, కొత్త గనులను తవ్వి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సీపీఆర్ఎంఎస్ పరిధి రూ.8 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఐఎన్‌టీయూసీ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు, కేంద్ర నాయకులు సీహెచ్ భీంరావు, కలవేని శ్యామ్, గరిగే స్వామి, సమ్ము రాజయ్య, వెంకటేశ్, తిరుపతి, జీవన్‌రావు, పిట్ సెక్రెటరీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భారీ యంత్రాలు సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు, ప్లానింగ్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో జరుగుతున్న పనులు వేగవంతం చేయాలన్నారు. బొగ్గు రవాణా, నాణ్యత తదితర అంశాలపై చర్చించారు. యంత్రాల విడిభాగాలు వాటి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారులు శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, ఇన్‌చార్జి ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘జూనోసిస్’తో జాగ్రత్త..!

- పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

మంచిర్యాలఅగ్రికల్చర్: పశువులు, ఇతర జంతువులు, కోళ్లు, పక్షుల నుంచి సోకే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారు. పశువులు, పాకల అపరిశుభ్రత, తదితర కారణాల వల్ల సుమారు 200 రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా జూలై 6న జూనోసిస్ డేగా పాటిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యాధులపై మంచిర్యాల పశువైద్యులు శంకర్ వివరించారు.

ఇదే రోజు ఎందుకు?

జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై బ్రిటిష్‌కు చెందిన శాస్త్రవేత్తలు కొన్నేళ్లుగా టీకాలతో ప్రయోగాలు చేశారు. 1885, జూలై 6న లూయిస్ ప్యాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తున్నారు.

కుక్కకాటుకు రేబిస్ టీకా

పిచ్చి కుక్క కరిచిన మనుషులకు రేబిస్ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి చాల ప్రాణాంతకమైనది. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఇప్పిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు.

ఆంత్రాక్స్–బ్రూసెల్లోసిస్..

పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు అనేకం. దొమ్మ (ఆంత్రాక్స్) వ్యాధి కటిక పని చేసే వారికి, గొర్రె, మేక, పశువులు చనిపోతే చర్మం కోసం వాటిని కోసే వారికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధమున్న పరిశ్రమల్లో పనిచేసే వారికి కూడా ఈ వ్యాధి రావచ్చు. డెయిరీల్లో పనిచేసే వారికి, పశువైద్యులకు బ్రూసెల్లోసిస్ సోకే అవకాశం ఉంది. వ్యాధి సోకిన వారికి నపుంసకత్వం రావచ్చు. వ్యాధి సోకిన పశువుల గర్భం కోశం నుంచి సంక్రమించే ద్రవం, చీము, వీర్యం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గర్భస్రావం జరిగిన పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించి, సరైన వైద్యం చేయిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. వ్యాధి నివారణకు టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

కలుషితమైన పాలతో క్షయ..

కలుషితమైన పాలు తాగితే క్షయ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే బాగా కాచి, చల్లార్చిన పాలనే తాగాలి. ధాన్యం గిడ్డంగుల్లో పనిచేసే వారికి లెప్టోస్పైరోసిస్ వ్యాధి సోకుతుంది.

ఈ వ్యాధులు కూడా..

హైడాటిసిస్, ఎకైనోకోకస్ (అంతర్గత పరాన్న జీవులు) కారణంగా మనుషులకు జూనోసిస్ వ్యాధులు సోకుతాయి. మాంసాన్ని సరిగా ఉడికించి తింటే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి, సరిగ్గా ఉడకని గుడ్లు , మాంసం తిన్న వారికి సాల్మోనల్లోసిస్ వ్యాధి సోకుతుంది. కుళ్లిన ఆహార పదార్థాలు తిన్నవారు కూడా వ్యాధి బారిన పడతారు.

వ్యాధుల నివారణకు..

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసం, సరిగా ఉడకని గుడ్లు తినకూడదు. అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లను ఆహారంగా తీసుకోకుడదు. వ్యాధి సోకిన పశువుల పాలు తాగకూడదు. పాడి పశువులు, జంతువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. కాలానికి అనుగుణంగా ఇవ్వాల్సిన రోగ నిరోధక టీకాలను వేయించాలి. చనిపోయిన పశువులను, జంతువులను దూర ప్రాంతాల్లో లోతైన గోతిలో సున్నం చల్లి పూడ్చి పెట్టాలి.

‘హరిత’ లక్ష్యం @ 4 లక్షలు

- శ్రీరాంపూర్ నర్సరీలో సిద్ధంగా మొక్కలు
- 1,400 హెక్టార్లలో ప్లాంటేషన్


శ్రీరాంపూర్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వర్షాలు కురుస్తుండడంతో సింగరేణి సంస్థ హరితహారం కార్యక్రమానికి సిద్ధమైంది. శ్రీరాంపూర్ ఏరియాలో 4 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం 45 హెక్టార్ల భూమిని సిద్ధం చేశారు. గడిచిన 15 ఏళ్లలో కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో 14,000 హెకార్టల్లో ప్లాంటేషన్ చేయగా ఒక్క శ్రీరాంపూర్ ఏరియాలోనే ఇప్పటి వరకు 1,400 హెక్టార్లలో ప్లాంటేషన్ చేశారు. ఈసారి ప్లాంటేషన్‌కు అవసరమైన మొక్కలను జీఎం ఆఫీసు ముందున్న నర్సరీలో సిద్ధం చేశారు. ఇందులో రెండు లక్షల మొక్కలు కంపనీ నేరుగా నాటడానికి ఏర్పాట్లు చేసింది. కొత్తగా చదును చేసిన స్థలాలతో పాటు ఇంతకు ముందు నాటిన మొక్కల్లో ఎండిపోయిన వాటి స్థానాల్లో తిరిగి ప్లాంటేషన్ చేస్తారు. కంపనీ ఖాళీ స్థలాలతోపాటు ఓసీపీ ఓబీ డంప్‌యార్డులపై మొక్కలు నాటనున్నారు. మిగిలిన రెండు లక్షల మొక్కలు పరిసర గ్రామాల్లో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో రావి, మర్రి, వెదురు, సీమచింత, బూరుగు, వేప, చింత, తాని, నారేప, ఉసిరి, నేరేడు, వంటి వృక్షజాతి మొక్కలతో పాటు మామిడి, జామ, సీతాఫలం, సపోట, కొబ్బరి, దానిమ్మ, నిమ్మ, పనస వంటి పండ్ల మొక్కలు కూడా ఉన్నాయి. కార్మిక కుటుంబాలు వీటిని ఇంటి ఆవరణలో నాటుకోవాలని సూచిస్తున్నారు

కోతుల బెడద తీరాలి..

కాలనీల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. గనుల పక్కనున్న అడవుల్లో వాటికి ఆహారం లభించకపోవడంతో కాలనీల్లోకి వచ్చి నానాబీభత్సం సృష్టిస్తున్నాయి. గనుల పరిసరాల్లోని అటవీప్రాంతంలో పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తే కాలనీల్లో ఈ కోతుల బెడద తప్పుతుందని కార్మిక కుటుంబాలు పేర్కొంటున్నాయి.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా కనీసం మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. కంపెనీ ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఈ సారి 4 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించాం.

– బీ.సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్

చిన్నారిని చిదిమేసిన స్కూల్ వ్యాన్


టిల్లు పటేల్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): అప్పటి వరకు ముద్దులొలికే మాటలతో ఇంట్లో సందడి చేసిన చిన్నారి స్కూల్‌కు వెళ్లిన అన్నయ్య తిరిగి ఇంటికి వచ్చాడన్న సంబురంలో ఎదురుగా వెళ్లగా స్కూల్ వ్యాన్ రూపంలో మృత్యువు కబలించింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెబ్బెన మండలంలోని నంబాలకు చెందిన ఇంగు సాయికుమార్, లావణ్య దంపతులకు నియాన్ పటేల్, టిల్లు పటేల్ (23నెలలు) కుమారులు సంతానం. నియాన్ నంబాలలోని స్కార్లస్ పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. రోజూ వ్యాన్‌లోనే పాఠశాలకు వెళ్లి వస్తుంటాడు. ఈక్రమంలో బుధవారం సైతం పాఠశాలకు వెళ్లిన నియాన్ సాయంత్రం స్కూల్ వ్యాన్‌లో ఇంటికి రాగా అన్న వచ్చాడన్న సంబురంలో ఇంట్లో ఆడుకుంటున్న టిల్లు పటేల్ వ్యాన్ వద్దకు వెళ్లాడు. అయితే అప్పటికే వ్యాన్ దిగిన నియాన్ వెనుక నుంచి నడుచుకుంటూ ఇంటివైపు రాగా టిల్లు మాత్రం వ్యాన్‌కు ముందు వైపు వెళ్లాడు. ముందున్న టిల్లును చూసుకోని డ్రైవర్ వ్యాన్‌ను కదిలించడంతో టైర్ కిందపడ్డాడు. తలపై వ్యాన్ టైర్ ఎక్కడంతో పక్కనే ఉన్న స్థానికులు గమనించి కేకలు వేస్తూ వ్యాన్‌ను వెనక్కి నెట్టారు. తలకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన అదే వ్యాన్‌లో బెల్లంపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్ వరిమడ్ల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు.

గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి సీఅండ్ఎండీ శ్రీధర్


వీసీలో పాల్గొన్న జీఎం దేవేందర్, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నుంచి గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా అధికారులు శ్రద్ధ చూపాలని సింగరేణి సీఅండ్ఎండీ శ్రీధర్ అన్నారు. బుధవారం అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం దేవేందర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఈ ఏడాది కొత్తగా ప్రారంభించదలిచిన వీకే కోల్‌మైన్ (కొత్తగూడెం), రొంపేడు ఓసీపీ (ఇల్లందు)తో పాటు గోలేటి ఓసీపీ (బెల్లంపల్లి) గనులకు సంబంధించి మిగిలి ఉన్న అటవీశాఖ అనుమతులను తక్షణమే పొందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. గోలేటి ఓసీపీ వార్షిక ఉత్పత్తి లక్ష్యం 35 లక్షల టన్నులు అయినప్పటికీ ఈ ఏడాది కనీసం 5 లక్షల టన్నులు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం నరేందర్, పీవో ఉమాకాంత్, డీజీఎంలు రామారావు, ఉజ్వల్‌కుమార్ బెహరా, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దులో విద్యుదాఘాతంతో మృతిచెందిన గ్రామపంచాయతీ కార్మికుడు రాచకొండ ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఏ.శ్రీదేవి, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కాంగ్రెస్ నాయకుడు నాతరి స్వామి అన్నారు. బుధవారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ద్వారా రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు లక్ష్మణ్, గౌస్, సమ్మిరెడ్డి, శివ, కిరణ్ పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాలటౌన్: 2023– 24 విద్యాసంవత్సరానికి మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంపీసీ, డేటాసైన్స్, బీకాం జనరల్, బీకాం సీఏ, బీఏ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ధృవీకరణ పత్రాలతో కళాశాలలో ఈ నెల 7వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న ఎన్ఆర్ఐ చంద్రశేఖర్

దహెగాం(సిర్పూర్): మండలంలోని లగ్గాం గ్రామానికి చెందిన అనాథ పిల్లలకు చింతలమానెపల్లి మండలంలోని బాలజీ అనుకోడ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ జాడే చంద్రశేఖర్ బుధవారం రూ.35వేల నగదు అందజేశారు. ‘అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది’ శీర్షికన సాక్షిలో వచ్చిన కథనం చూసి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు రాంటెంకి నవీన్, దుర్గం గౌతమ్, డొంగ్రీ సురేశ్, దుర్గం దేవదాస్, మహేందర్, ఆనంద్‌రావు, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి యువకుడు మృతి

బెల్లంపల్లి: అతిగా మద్యం సేవించి యువకుడు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మున్సిపాలిటీలో వెలుగు చూసింది. వన్‌టౌన్ ఏఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి బస్తీలో నివాసం ఉంటున్న రైలు సాయి (21) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. మంగళవారం రాత్రి ఇంట్లోనుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఇంటి వెనకాల మృతదేహాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తల్లి వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అభ్యంతరాల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించబడిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు నవంబర్ 6, 2019లో అభ్యర్థులకు నిర్వహించిన రాతపరీక్ష మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 6లోగా తగిన ఆధారాలతో డీఈవో కార్యాలయంలో అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సూచించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్, డాటాఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ ఎనాలిస్టు, అసిస్టెంట్ ప్రోగ్రామర్ పోస్టులు భర్తీ చేసేందుకు స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ తెలంగాణ సమగ్ర శిక్ష హైదరాబాద్ పరీక్ష నిర్వహించి మెరిట్ జాబితాను ప్రదర్శించినట్లు డీఈవో పేర్కొన్నారు.

మున్సిపల్ ట్యాంకర్.. ప్రైవేటుకు విక్రయం



దుకాణాలకు నీటిని అందిస్తున్న ట్రాక్టర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుండగా.. బల్దియా ట్రాక్టర్లతో యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణ ప్రజలకు మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలకు నేరుగా ట్రాక్టర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు మే నెలలో 12 ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రతీ వార్డులోని ప్రజలకు నేరుగా తాగునీటిని అందించాల్సి ఉంది. కానీ కొందరు మున్సిపల్ సిబ్బంది కమర్షియల్ భవనాలకు విక్రయిస్తున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలకు నేరుగా సరఫరా చేస్తున్నారు.

కౌన్సిలర్లు, ట్రాక్టర్ డ్రైవర్ల వాగ్వాదం

ప్రతీరోజు వార్డుల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, తమ వార్డుకు సరఫరా చేయాలని కౌన్సిలర్లు కోరుతున్నా పాలకవర్గం, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కమర్షియల్ దుకాణాలు, హోటళ్లకు నీటి అమ్ముకోవడంతో కౌన్సిలర్లు ట్రాక్టర్ల డ్రైవర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బుధవారం ట్రాక్టర్ డ్రైవర్లు విధులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు సర్ది చెప్పడంతో డ్రైవర్లు విధులు నిర్వర్తించారు. తాగునీటిని బయటకు అమ్ముకోవద్దని కౌన్సిలర్లు చెప్పినా డ్రైవర్ల తీరు మారలేదు. తాగునీటి ట్రాక్టర్లను నేరుగా స్కానింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లి నీటిని అందించడం గమనార్హం.

అధికారుల దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రైతులు

కోటపల్లి: పోడు భూములకు పట్టాలు రాకుండా ఆపారని మండలంలోని కొండంపేట గ్రామస్తులు బుధవారం అధికారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌సీ కమిటీ చైర్మన్ నైతం మహేశ్ మాట్లాడుతూ 64 కుటుంబాల ఆదివాసీలు 20 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తుంటే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు రాకుండా అడ్డుకున్న అధికారులపై చర్యలు తీసుకుని పట్టాలు వచ్చేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న సీఐ ముత్తులింగం

శ్రీరాంపూర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన శ్రీరాంపూర్ పోలీసులు బుధవారం బాధితులకు అప్పగించారు. 2023, జూన్ 22న శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద స్థానిక భగత్ సింగ్‌నగర్‌కు చెందిన కాసిపేట రాజేశం, మంచిర్యాలకు చెందిన అరవింద్‌కుమార్ ఫోన్లు పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టర్ ద్వారా పోలీసులు ఈ రెండు ఫోన్లను గుర్తించారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ ముత్తులింగం, ఎస్సై రాజేశ్ బాధితులకు ఫోన్లను అప్పగించారు.